తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ


కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, మహిళా అధికారులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, సఖీ కేంద్రానికి చెందిన మహిళా అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బతుకమ్మను ఎత్తి మహిళలతో కలిసి వేడుకల్లో ఆడిపాడారు. మహిళలు బతుకమ్మను భక్తి శ్రద్ధలతో కొలుస్తూ పండగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం, డీఆర్డీవో నర్సింహులు, డీపీఆర్వో శ్రీనివాస్, సమాచార ప్రసారాల శాఖ డీఈ ఇస్రానాయక్ తదితరులు పాల్గొన్నారు

చెంచులు.. చల్లంగుండాలని..!

ప్రత్యేక వైద్య సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి ● మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ప్రతిపాదనలు సిద్ధం

ఈనాడు, మహబూబ్‌నగర్ – న్యూస్‌టుడే, అమ్రాబాద్

> నల్లమల చెంచుల అభ్యున్నతి, ఆరోగ్యం కోసం ఎన్ని కార్యక్రమాలు ప్రవేశపెట్టినా.. పూర్తి స్థాయిలో అమలవడం లేదు. పోషకాహారం, ఆరోగ్య వసతులు లేక అర్ధాంతర మరణాలతో జనాభా తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో దృష్టి సారిస్తేనే చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ఏడేళ్లలో 620 మంది చెంచులు మృత్యువాత పడ్డారు. వీరిలో 80 శాతం మంది పౌష్టికాహారం, అనారోగ్య సమస్యలతో చనిపోయినవారే ఉన్నారు. చెంచు పెంటల్లో నివసిస్తున్న ఆదివాసీల ఆయు ప్రమాణాలు 50 ఏళ్ల లోపు పడిపోతున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తున్నాయి.

● గతంలో నాటి గవర్నర్ తమిళిసై అప్పాపూర్, బౌరాపూర్ చెంచు పెంటలను దత్తత తీసుకుని గర్భిణులకు పౌష్టికాహారంతోపాటు రాజశ్రీ కోళ్లను ప్రతి కుటుంబానికి 10 చొప్పున అందించారు. బైకు అంబులెన్సులు ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో మళ్లీ ఈ రెండు పెంటల్లో సాధారణ పరిస్థితులొచ్చాయి.

● వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల ఆదివాసీల ఆరోగ్యంపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయగా పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలైతేనే చెంచుల ఆరోగ్యం బాగు పడుతుంది.


నల్లమలలోని ఓ చెంచు కుటుంబం

> నల్లమలలోని ఈర్లపెంటలో మూడు నెలల క్రితం కాన్పు తర్వాత ఓ చెంచు మహిళ మృతి చెందింది. రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం, పోషకాహార లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. బాలింత మృతి చెందిన కొన్ని రోజులకే శిశువు కూడా మృత్యువాత పడింది. మన్ననూరు ఐటీడీఏ పరిధిలో 88 చెంచు పెంటలున్నాయి. ప్రస్తుతం 8,400 జనాభా ఉంది. ఏటా ఈ జనాభా తగ్గుతుండటం ఆందోళన కలిస్తోంది. అనారోగ్య సమస్యలతోనే చిన్న వయసులో పలువురు మృతి చెందడమే దీనికి కారణం.


నిర్వహణ లేక వృథాగా ఉన్న బైకు అంబులెన్సు

సమీక్షలో చర్చకొచ్చిన అంశాలివీ..

● అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఆస్పత్రుల్లో చెంచుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. అక్కడికి వెళ్లగానే నేరుగా వైద్యం అందించాలి.

● చెంచుపెంటల్లో బైకు అంబులెన్సుల నిర్వహణకు కావాల్సిన సిబ్బంది, ఇంధన ఖర్చు వంటివి సమకూర్చాలి. వన్యమృగాల సంచారం నేపథ్యంలో బైకు అంబులెన్సుల్లో పెంటల్లోకి వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రత్యేకంగా అంబులెన్సును ఏర్పాటు చేసి సీటీస్కాన్, ఇతర పరిశీలన నిర్వహించే సామగ్రిని అందుబాటులో ఉంచాలి.

● చెంచుపెంటల్లో ఔషధాల కోసం ప్రత్యేకంగా స్టోర్, డయాగ్నస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేయాలి. మహిళల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

● జ్వరాలు వస్తే చికిత్స కోసం వైద్య సిబ్బంది చెంచు పెంటల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలి.

● ఇక్కడి చాలా కుటుంబాలు సారాకు బానిసయ్యాయి. సంపాదన మొత్తం దీనికే ఖర్చు చేస్తున్నారు. అనారోగ్యంతో చిన్నతనంలోనే మృత్యువాత పడుతున్నారు. అచ్చంపేటలోనే డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారిలో మార్పు తీసుకురావాలి.

వసతులే లక్ష్యంగా ప్రతిపాదనలు..: నాగర్‌కర్నూల్ డీఎంహెచ్‌వో, మన్ననూరు ఐటీడీఏ పీవో బాధ్యతలు పర్యవేక్షిస్తున్న రోహిత్ గోపిడి 'ఈనాడు'తో మాట్లాడుతూ 14న చెంచుల ఆరోగ్యానికి కావాల్సిన ప్రతిపాదనలను అందించనున్నామన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి వైద్య సేవలు అందిస్తామన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులుగా 1,131 మంది ఎంపిక
● నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు

అచ్చంపేట, పాలమూరు, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తరువాత 1:1 నిష్పత్తిలో తుది జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులు ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వివరాలను డీఈవోల వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచడంతో పాటు అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చారు. ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల నుంచి వారు ఎంపిక చేసుకున్న పోస్టు కోసం డిక్లరేషన్ తీసుకున్నారు. మరో పోస్టులో కూడా ఎంపికైన వారు ఉంటే వారి పేర్లను తొలగించి మెరిట్ జాబితాలో తదుపరి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు.


మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	ఎంపికైన ఉపాధ్యాయులు	ఆర్టీసీ బస్సులు
మహబూబ్‌నగర్	243	06
నాగర్‌కర్నూల్	285	07
జోగులాంబ గద్వాల	172	04
వనపర్తి	152	04
నారాయణపేట	279	07

జిల్లాల వారీగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి ఎంపికైన వారిని కలెక్టర్ కార్యాలయాల వద్దకు చేరుకోవాలని సమాచారం ఇచ్చారు.

అభ్యర్థుల తరలింపునకు 28 బస్సులు..: ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులను ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద బుధవారం ఉదయం ఫోటో గుర్తింపు కార్డులు అందజేస్తారు. హైదరాబాద్‌లోని సీఎం సభకు వెళ్లేందుకు అధికారులు 28 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. దసరా సెలవులు పూర్తయ్యేలోగా ఎంపికైన వారికి పాఠశాలలను కేటాయించి సెలవుల తరువాత విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు.




Eenadu, Jadcherla Agent : 8008333808

విద్యుత్తు నియంత్రికల చుట్టూ పిచ్చిమొక్కల తొలగింపు


చెట్ల తీగలు తొలగిస్తున్న విద్యుత్తు సిబ్బంది

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో విద్యుత్తు నియంత్రికల చుట్టూ ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగింపునకు విద్యుత్తు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. 'పచ్చని పొదల మాటున ప్రమాదం' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన ఫోటో చిత్రాలకు స్పందించిన విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు వెంటనే లైన్‌మెన్లను అప్రమత్తం చేశారు. బోయపల్లిగేట్, పోలీస్‌లైన్, కలెక్టర్ నివాసం, కొత్తచెరువురోడ్, ఖలీల్‌చౌక్, టీడీగుట్ట ప్రాంతాల్లో నియంత్రికల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కల తీగలను విద్యుత్తు సిబ్బంది తొలగించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు మొక్కల తొలగింపు కొనసాగించడంతో నియంత్రికల చుట్టూ శుభ్రత నెలకొంది





కాత్యాయనిగా జోగులాంబ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జోగులాంబ, కాత్యాయనీ దేవిగా భక్తులకు నేత్ర పర్వం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి అభిషేకం, స్పర్శ దర్శనం, జోగులాంబకు కుంకుమార్చనలు, అలాగే యాగశాలలో చండీ హోమం, సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కొలువు పూజ నిర్వహించారు. జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో అమ్మ వారి సన్నిధి నుంచి తీసుకు వచ్చి కొలువు పూజ పూర్తి చేశారు.

-న్యూస్‌టుడే, అలంపూర్

ఆలయాల అభివృద్ధికి చర్యలు: కొండా సురేఖ


పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కొండా సురేఖ

అలంపూర్, న్యూస్‌టుడే: పవిత్రమైన, ప్రాచీన శిల్ప సంపదకు ఆలవాలమైన అలంపూర్ ఆలయాలను అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఇక్కడ జరగనున్న కల్యాణోత్సవానికి మంత్రి మంగళవారం ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. దేవాలయంలో పూజల అనంతరం టూరిజం వసతి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆలయం పురావస్తు శాఖ పరిధిలో ఉన్నందున ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర నుంచి కూడా నిధులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేసీఆర్ పుష్కరాలకు వచ్చి ఆలయాల అభివృద్ధికి రూ. వంద కోట్లు మంజూరు చేస్తామని హామీ వచ్చి మరిచిపోయారని విమర్శించారు. అనంతరం ప్రసాద్ పథకం కింద జరుగుతున్న పనులను మంత్రి పరిశీలించారు. త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మంత్రికి కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



శ్రీమహాలక్ష్మీదేవిగా మైసమ్మ



నవాబ్‌పేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్వతాపురం మైసమ్మ దేవతను మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. మండల పరిధిలోని పోమాల్ గ్రామ అనంత పద్మనాభస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్చరించినా.. నిర్లక్ష్యమే

రెండు నెలల్లో పదవీ విరమణ.. అంతలోనే సస్పెన్షన్


సస్పెన్షన్‌కు గురైన ఆర్డీవో నాగరాజు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యం వద్దంటూ కొల్లాపూర్ ఆర్డీవోను పలుమార్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు అప్రమత్తం చేశారు. హెచ్చరికలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆర్డీవో నాగరాజును సస్పెన్షన్ చేస్తూ రెవెన్యూ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధరణి దస్త్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరించటంతో ఓ మాజీ సర్పంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ధరణి విషయంలో ఆర్డీవో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఓఆర్‌సీల జారీ విషయంలో రైతులను ఎక్కువగా ఇబ్బందులకు గురి చేశారన్న ఫిర్యాదులున్నాయి. కార్యాలయంలో ప్రతి చిన్న పనికి డబ్బులు అడుగుతారనే విమర్శలున్నాయి. నాగరాజు మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. కొల్లాపూర్‌లో ఆయన ఏడాది నుంచి ఆర్డీవోగా కొనసాగుతున్నారు. విధుల్లో అలసత్వం, అవినీతి ఆరోపణలతో ఆర్డీవో సస్పెన్షన్ కావడం జిల్లాలో ఇదే మొదటిసారి. వివిధ ప్రాంతాల నుంచి ధరణి సమస్యలను పరిష్కరించాలని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికంగా ఫిర్యాదులు వస్తున్నా.. కొందరు అధికారుల్లో స్పందన లేదు. ప్రతి వారం 90 దరఖాస్తులు వస్తున్నా.. అధికంగా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఇటీవలే తహసీల్దార్ల బదిలీలు అయ్యాయి. అంతకు ముందు కొందరు తహసీల్దార్లపై ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. దస్త్రాలను పెండింగ్‌లో పెట్టడం.. బేరం కుదిరిన తర్వాతనే పరిష్కరించేవారనే ఆరోపణలున్నాయి. ఆర్డీవో స్థాయి అధికారిపైనే వేటు పడటంతో జిల్లాలోని రెవెన్యూ సిబ్బందిలో గుబులు మొదలైంది.



Eenadu, Jadcherla Agent : 8008333808

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు : కలెక్టర్

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అన్ని సదుపాయాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, పౌరసరఫరాల సంస్థ డీఎం విక్రమ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి నర్సింహులు, జిల్లా సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు శంకరాచారి, బాలమణి తదితరులతో కలిసి ధాన్యం సేకరణపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. రైతులు తీసుకు వచ్చే ధాన్యంలో సన్నరకం, దొడ్డు రకం గుర్తించి వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సూచిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాకు రూ. 2,320, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ. 2,300 చెల్లించాలన్నారు. సన్నరకం ధాన్యం తీసుకొచ్చిన రైతులకు అదనంగా రూ. 500 బోనస్ అందజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని, ధాన్యంలో తేమ శాతం 17కు మించకుండా నిర్ణీత నాణ్యత ప్రమాణాలు ఉండేలా రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 1,92,646 ఎకరాల్లో వానాకాలం వరి పంట సాగు జరిగిందని, తద్వారా 4,48,082 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, వీటిలో సన్న రకం ధాన్యం 3,85,632 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 62,450 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అంచనా ఉందని, కొనుగోలు కేంద్రాలకు సన్నరకం 2,31,379, దొడ్డు రకం 37,470 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ అంచనా వేశారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో ట్యాబ్‌లో ఎంట్రీ చేయించి 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బు జమ చేయించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ట్యాగ్ చేసిన మిల్లుకే ధాన్యం పంపించాలని ఆదేశించారు.



(c) eenadu

కలల కొలువు కైవసం

కలల కొలువు కైవసం ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివి అనుకున్నది సాధించారు. కలల కొలువు కైవసం చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికవడంతో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా విజేతల మనోగతమిది..

- న్యూస్‌టుడే, బృందం

చిరకాల కల.. నెరవేరిందిలా 2012 డీఎస్సీలో 0.4 శాతం మార్కుల తేడాతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయాను. 2017లో ఒక మార్కు తేడాతో అవకాశాన్ని పోగొట్టుకున్నా. అచ్చంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయుడిగా చేరాను. ఈసారి ఉద్యోగాన్ని సాధించాలన్న పట్టుదలతో డీఎస్సీకి సిద్ధమయ్యాను. స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) పరీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించా. కలల ఉద్యోగాన్ని సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.



- ఎడ్ల రవి, లత్తీపూర్ (ఉప్పునుంతల)



సంతోషంగా ఉంది: రోజూ 12 గంటలకుపైగా చదివాను. టీజీ డీఎస్సీ 2024లో సోషల్ స్టడీస్‌లో 75.53 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించి టీచర్ పోస్టుకు ఎంపికయ్యాను. సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనుండటం మరిచిపోలేను.

- టి రేణుక, గద్వాల

పట్టుదలతో మూడు ఉద్యోగాలు. . : అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ తీసుకున్నా. గురుకుల పీఈటీ ఉద్యోగానికి ఎంపిక కాగా ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రం అందుకున్నా. వసతి గృహ అధికారి ఉద్యోగానికి కూడా అర్హత సాధించాను. ధ్రువపత్రాల పరిశీలన చేయాల్సి ఉంది. తాజాగా డీఎస్సీలో పీఈటీ ఉద్యోగానికి అర్హత సాధించా.



- ముడావత్ శ్రీనివాస్‌నాయక్, పెద్దాయకుంట తండా(జడ్చర్ల)

హిందీ భాష పండితుడిగా...: మాది నిరుపేద గిరిజన కుటుంబం. 15 ఏళ్లుగా ప్రయివేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ప్రభుత్వ వృత్తి చేపట్టాలన్న పట్టుదలతో నోట్స్ తయారు చేసుకొని చదివాను. ఆన్‌లైన్ తరగతులను ఉపయోగించుకున్నా. బోధనా వృత్తిలో ఉండటంతో కలిసొచ్చింది. రెండో గ్రేడ్ హిందీ భాష పండితుడి ఉద్యోగానికి ఎంపికయ్యాను.



- మూడావత్ రవి, వంకేశ్వరం (పదర)

ఎస్‌జీటీగా.. : మాది పేద వ్యవసాయ కుటుంబం. హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీ, ఖమ్మం ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఈడీ పూర్తి చేశాను. 73.33 శాతం స్కోర్‌తో జిల్లా స్థాయిలో 19వ ర్యాంకు సాధించాను. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా (ఎస్‌జీటీ) ఎంపికయ్యాను.



- నెల్లికంటి హరీశ్, పదర

మొదటి ర్యాంకు రావటం ఆనందంగా ఉంది... : డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 84.37 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు పొందటం ఆనందంగా ఉంది. పాఠశాలలో పని చేస్తూనే, డీఎస్సీకి సిద్ధమయ్యాను.



- గోపాల్, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్

మూడో తరంలో కూడా.. : మా తాత ఉపాధ్యాయుడిగా పని చేశారు. తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే. నేను మూడోతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. చాలా సంతోషంగా ఉంది. డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 77.38 మార్కులు సాధించి 24 ర్యాంకు కైవసం చేసుకున్నాను. అమ్మానాన్నలు సహకారంతోనే ఈ విజయం సాధించాను.



- నవ్యశ్రీ, న్యూగంజ్, మహబూబ్‌నగర్

మా కుటుంబంలో తొలి ఉద్యోగం. . : అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. నాకు ఇద్దరు తమ్ముళ్లు. 11 గంటలపాటు చదివాను. 78.90 మార్కులతో 16వ ర్యాంకు పొందాను. మా కుటుంబంలో తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాను.



- శ్వేత, చిన్నదార్‌పల్లి(హన్వాడ)

తండ్రి స్ఫూర్తితోనే : నాన్న స్ఫూర్తితో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉపాధ్యాయ పరీక్షలకు సన్నద్ధమయ్యా. డీఎస్సీలో 70.43 మార్కులతో జిల్లా స్థాయిలో 134 ర్యాంకు వచ్చింది. డీఈవో కార్యాలయం నుంచి ఉద్యోగ అర్హత సందేశం రావడంతో చాలా సంతోషంగా ఉంది. **- అనిత, భూత్పూర్**



ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనే...: 2017 డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం కోల్పోయా. అప్పటి నుంచి పట్టుదలతో సిద్ధమయ్యా. 84 మార్కులతో ఎస్జీటీ తెలుగు మాధ్యమంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించా.



- తుప్పల్లి శివసాయి, మహబూబ్‌నగర్

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

భూత్పూర్ : కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. మాది షాద్‌నగర్, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. పోటీ పరీక్షల్లో 66.70 మార్కులతో ఉపాధ్యాయురాలిగా అవకాశం దక్కింది.



- తేజస్విని, అమిస్తాపూర్

లక్ష్యం నెరవేరింది : అమ్మానాన్న చిన్ననాటి నుంచే కూలీ పనులు చేస్తూ నన్ను చదివించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనే లక్ష్యంతో విద్యాభ్యాసం సాగించా. కొన్ని రోజులు ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేస్తూ, సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యా. 77.07 మార్కులతో పాలమూరు జిల్లా కేటగిరిలో 26వ ర్యాంకు సాధించా.



- దోకూరు అనిత, అమిస్తాపూర్

అవమానాలు ఎదుర్కొన్నా.. గత డీఎస్సీలో కొద్ది తేడాతో ఎస్జీటీ అవకాశాన్ని కోల్పోయాను. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో చదివాను. ఈ డీఎస్సీలో 70.8 శాతం మార్కులతో 49వ ర్యాంకు సాధించా. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్‌ఏ (జీవశాస్త్రం) ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నా.




- చింతల కార్తిక్, అచ్చంపేట

అమ్మ కష్టాన్ని చూసి ఉద్యోగం సాధించా..: నాన్న మృతిచెందడంతో అమ్మ శకుంతలమ్మ కూలీ పనులు చేస్తూ చదివించారు. అమ్మ కష్టాన్ని చూసి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చదివాను. ఎస్జీటీగా ఎంపికయ్యాను.



- శ్రీకాంత్, పెద్దమారూర్, చిన్నంబావి మండలం

రోజు ఏడు గంటలు చదివా..: డీఎస్సీలో ఆంగ్లంలో నాకు జిల్లా మొదటి ర్యాంకు వచ్చింది. 6 నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రోజు ఏడు గంటలు చదివాను. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా నియామకం సంతోషంగా ఉంది.



- అక్షయ్‌కుమార్, వనపర్తి

నాన్న, అక్కల స్ఫూర్తితో..: నాన్న, అక్కల లాగా నేను కూడా కావాలనే కోరిక నెరవేర్చుకున్నాను. డీఎస్సీలో 77.45 మార్కులతో ఓపెన్‌లోనే స్థానిక సంస్థల విభాగంలో స్కూల్ అసిస్టెంట్ గణితంలో మొదటి ర్యాంకు సాధించాను.



- బి.సుమన, మహబూబ్‌నగర్











వనపర్తి వల్లభ్‌నగర్‌లో ధనలక్ష్మి అవతారంలో.. దేవరకద్రలో వాసవీమాత అలంకారం.. మహబూబ్‌నగర్: వాసవీ మాత ఆలయంలో.. అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి అలంకరణ..

తంగేడు పూల సోయగం.. బతుకమ్మ సంబరం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మండపాల్లో కుంకుమార్చనలు, వాడ వాడలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఉత్సాహంగా కోలాటాలు, దాండియా ఆడారు.

- న్యూస్‌టుడే బృందం



అయిజ: కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణ



మహబూబ్‌నగర్: తలపై బతుకమ్మతో..



నాగర్‌కర్నూల్ : పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించిన మహిళలు



మహబూబ్‌నగర్: బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు



కొల్లాపూర్ : కోర్టు ఆవరణలో బతకమ్మకు పూజలు చేస్తున్న జడ్జీలు ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్ తేజ, జోత్స్న



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కందనూలు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో సంఖ్య 25 జారీ చేసి ప్రభుత్వ పాఠశాలలు ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రతి తండాలో పాఠశాలలు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, కిరణ్, రామస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రెజిల్ ఫెలోషిప్‌కు పాలమూరువాసి

పాలమూరు, న్యూస్‌టుడే : బ్రెజిల్ దేశ ప్రతిష్ఠాత్మక 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్' ఫెలోషిప్‌కు మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండలోని సంతోష్‌నగర్‌కు చెందిన డా. జయపాల్ ఎంపికయ్యారు. గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్‌కు మందులు కొనుక్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా 20 మంది శాస్త్రవేత్తలను ఎంపిక చేయగా ఆసియా నుంచి డా. జయపాల్ ఒక్కరే చోటు సంపాదించారు. ఈ బృందానికి ఆయనే నాయకత్వం వహించనున్నారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసిన డా. జయపాల్ చైనాలో శాస్త్రవేత్తగా పనిచేశారు. కరోనా కాలంలో భారత్‌కు వచ్చి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పనిచేశారు. ప్రస్తుతం సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఆచార్యుడిగా కొనసాగుతున్నారు. 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్'కు దరఖాస్తు చేయగా మూడు విడతలుగా అంతర్జాలం ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌కు ఎంపికవటం, చాలా దేశాల నుంచి వచ్చే శాస్త్రవేత్తలకు తాను ప్రధాన శాస్త్రవేత్తగా నాయకత్వం వహించనుండటం ఆనందంగా ఉందని డా. జయపాల్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.



డా. జయపాల్

EENADU e Classifieds

AGRI BUSINESS

POULTRY

VSAP De oiled rice bran (DOB) పౌల్ట్రీ ఫీడ్ 13,500/టన్నుకు అందుబాటులో ఉంది. సంప్రదించండి: 9246524659

HOUSE FOR SALE

House for Sale. Kumarwadi, Madina Masjid Road, Nr. Old Govt. Hospital, Mahaboobnagar. 125 Sq.Yds. 9885402646, 9346334624.

PLOT FOR SALE

పాలకొండ నియర్ బైపాస్ రోడ్డుకు అందుబాటులో వెస్ట్ నార్త్ కార్నర్ 210 (35x54) గజాల ప్లాటు అమ్మకానికి ఉంది. 2. భూత్పూరు రోడ్ సారిక టౌన్‌షిప్ వెస్ట్ ఫేస్ 266 (40x60) హాస్టల్ బ్యాక్ సైడ్ ప్లాట్ అమ్మకానికి ఉంది. 9010 464 999.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Md Ajaz Baba S/o Md Maqbool, R/O H.No. 4-72/1, Savaran Veedi Ward 3, Wanaparthy, Mahabubnagar, Telangana - 509103, have changed my name to Mohammad Ajaz Baba

I, Md Maqbool S/o Abdul Raheman, R/O H.No.4-72/1, Savaran Veedi Ward 3, Wanaparthy, Mahabubnagar, Telangana - 509103, have changed my name to Mohammad Maqbool

I Mohammed Faheem S/O Isamiya R/O H.No. 4-138/1, Vinayaknagar Colony, Achampet, Nagarkurnool Dist. T.G., hereby declare that I have changed my name from MD.Yahya (Old Name) to Mohammed Faheem (as per my Aadhar, Pan Card, New Name).

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 8317512135.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. [illegible]

PEOPLE CARE

OLD AGE HOME

ఓమ్ హోంకేర్ [illegible] 24గం॥ [illegible] © 89776 39664, 89776 39665.

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ టౌన్‌లో [illegible] Rs. 3300/- for Sft. 2 & 3 BHK Flats [illegible] 90% హౌసింగ్ లోన్ [illegible] © 7013510429, 9441382770

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:8008001824

తనిఖీ చేయకున్నా నియామకమా..?

పేట డీఈవో కార్యాలయం ఎదుట అభ్యర్థుల ఆందోళన





డీఎస్సీ అభ్యర్థుల నిరసనకు మద్దతు తెలుపుతున్న పీఆర్టీయూ టీఎస్, తపస్ జిల్లా అధ్యక్షులు.. డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలు జరిగాయని, ధ్రువపత్రాల తనిఖీ చేయని వ్యక్తికి ఎలా ఉద్యోగం ఇస్తారని పలువురు అభ్యర్థులు ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ వీరికి మద్దతు తెలిపారు. జాబితా సవరించి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని, డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన అభ్యర్థులకు అధికారి తీరుతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. భాష పండిత్ (హిందీ)లో ఐదో ర్యాంకు వచ్చిన తనను కాకుండా అర్హత లేని, ధ్రువపత్రాల పరిశీలన చేయని అభ్యర్థిని ఎంపిక చేయడం సరికాదని భారతి అనే మహిళ అవేదన వ్యక్తం చేశారు. జుట్ల కవిత, తిమ్మప్ప అనే అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ సోషల్, తెలుగుల్లో ర్యాంకులు సాధించారు. తాము సోషల్ కోరుకుంటే తెలుగు ఎలా కేటాయిస్తారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో స్థానిక సీఐ శివశంకర్, పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఈవో అబ్దుల్ ఘని చెప్పినా ఆందోళనకారులు తగ్గలేదు. డీఈవో కార్యాలయం ఎదుట రాత్రి వరకు బైఠాయించారు. రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు ఒక్కొక్కరూ జమ అవుతుండటంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

అభ్యర్థులకు అన్యాయం జరిగింది : పీఆర్టీయూ

ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలతో డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,నాయకులు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవో తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

తపాలా శాఖ నిర్లక్ష్యంతో చేజారిన ఉద్యోగం

గత 27న మౌఖిక పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4న చేరిన లేఖ



తపాలా కార్యాలయం వద్ద ఆలస్యంగా వచ్చిన లేఖ చూపుతున్న యువకుడు నాగరాజు

జడ్చర్ల, న్యూస్‌టుడే : యువకుడికి సకాలంలో లేఖ అందకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగ అవకాశం చేజారిన ఘటన జడ్చర్లలో మంగళవారం వెలుగు చూసింది. బాధితులు, తపాలా శాఖ అధికారుల కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం గంగాపూర్‌కు చెందిన బి.నాగరాజు బీఎస్సీ చదివారు. 12 ఏళ్ల క్రితం తండ్రి చనిపోగా తల్లి, చెల్లి ఉన్నారు. ఏ జీవనాధారం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతూనే కుటుంబ పోషణ కోసం స్థానిక పోలేపల్లిలోని ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. 2023లో నాగరాజు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌లో ఉద్యోగానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో పరిశీలన కోసం తన విద్యార్హత ధ్రువపత్రాలను పంపించారు. నాగరాజుకు మెరిట్ మార్కులు, జోనల్‌లో ఎస్సీ కోటాలో ఒకే ఉద్యోగం ఉండటంతో మౌఖిక పరీక్షకు అర్హత సాధించారు. సెప్టెంబర్ 27న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాలని కమిషన్ అధికారులు సెప్టెంబరు 4న అభ్యర్థికి స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. సకాలంలో హాజరుకాకపోయినా, ధ్రువపత్రాలు సరిగ్గాలేకపోయినా ఉద్యోగానికి అర్హత ఉండదని లేఖలో పేర్కొన్నారు. తపాలా శాఖ ద్వారా పంపిన లేఖ గడువు ముగిసిన తర్వాత ఈ నెల 4న అభ్యర్థి నాగరాజుకు అందింది. అతడు అధికారులను సంప్రదించగా మౌఖిక పరీక్షకు హాజరుకాకపోవడంతో మరొకరికి ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగం చేజారిపోవడంతో బాధితుడు మంగళవారం జడ్చర్లలోని తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లి ప్రశ్నించారు. దీనిపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గంగాపూర్ గ్రామంలో లేఖలు పంపిణీ చేసే శ్రీకర్ గత నెల 24న ఉద్యోగానికి రాజీనామా చేయటంతో మరో వ్యక్తి సర్దార్‌కు ఆ బాధ్యత అప్పగించామని పేర్కొన్నారు. గత నెల 18న అందించినట్లు తమ సిబ్బంది చెబుతున్నా అందులో నిజం లేదని, ఈ నెల 4వ తేదీనే అందినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. సకాలంలో లేఖ అందించకపోవడానికి కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగం చేజారడంతో బాధితుడు, కుటుంబ సభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

మాట వినడంలేదని మట్టుబెట్టాడు

భార్యను సుత్తితో బాది చంపిన భర్త



క్రిష్ణవేణి

నార్సింగి, న్యూస్‌టుడే: భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని, తన మాట వినడం లేదని కోపం పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెను సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన ఉదంతం హైదరాబాద్‌లోని హైదర్షాకోట్ మాధవీనగర్‌లో వెలుగు చూసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరిక్రిష్ణారెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన శ్రీనివాస సాగర్, క్రిష్ణవేణి(32) దంపతులు జీవనోపాధి కోసం వలసవచ్చి హైదర్షాకోట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. తనను నిర్లక్ష్యం చేస్తోందని, చెప్పిన మాట వినటం లేదని భార్యపై శ్రీనివాస సాగర్ ద్వేషం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య తలపై సుత్తితో బాదడంతో ప్రాణాలు కోల్పోయింది. అనంతరం నిందితుడు ఇద్దరు పిల్లలతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి

ధరూర్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేవులపల్లి గ్రామంలో ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అబ్దుల్ షుకూర్ కథనం మేరకు. . రేవులపల్లిలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలు డీజే సౌండ్ సిస్టమ్‌తో బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో డీజే సౌండ్ తక్కువగా పెట్టాలని కృష్ణవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బతుకమ్మ ఊరేగింపు నిర్వాహకులకు కృష్ణవర్ధన్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఆర్మీజవాన్ మణివర్ధన్ తమ్ముడిపై కృష్ణవర్ధన్ దాడి చేశారు. విషయం తెలుసుకున్న మణివర్ధన్ బతుకమ్మ సంబరాల వద్దకు వచ్చి వారించటానికి ప్రయత్నించాడు. కోపోద్రిక్తుడైన కృష్ణవర్ధన్ సమీపంలో ఉన్న తన ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి మణివర్ధన్‌పై దాడి చేశాడు. మణివర్ధన్‌కు తీవ్ర గాయాలు కావటంతో గద్వాల ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇనుప కడ్డీ గుచ్చుకుని ఒకరి మృత్యువాత

ఇటిక్యాల, న్యూస్‌టుడే: ఇనుప గ్రిల్ కడ్డీ గొంతుకు కుచ్చుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎర్రవల్లిచౌరస్తాలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గద్వాల మండలం బసాపురం గ్రామానికి చెందిన కె.క్రిష్టారెడ్డి(68) ఉద్యోగ విరమణ అనంతరం కొత్తకోటలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం ఎర్రవల్లిలో బంధువుల వద్దకు వచ్చాడు. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ వద్ద మూత్రవిసర్జన చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గ్రిల్‌పై పడ్డాడు. గొంతు నుంచి కడ్డీ తల భాగంలోకి చొచ్చుకుపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. అప్పన్నపల్లికి చెందిన పెంటయ్య గౌడ్(38)కు వెనుకా ముందు ఎవరూ లేకపోవటం, కటిక పేదరికంతో జీవితంపై విరక్తి చెంది అప్పన్నపల్లి వంతెన సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (0/o DISTRICT REGISTRAR) AT: MAHABUBNANAGAR
ARBITRATION CLAIM PETITION NO. 221 of 2024
Between:
PAVANASAI CHIT FUND PVT, LTD, Mahabubnagar Branch, Represented by its Legal Officer Sri.M.Chennaiah. ..DISPUTANT
AND
DUREDDY SHYLAJA & Others ..OPPONENTS No: 1 to 5.
NOTICE
I. DUREDDY SHYLAJA W/o: SHYAMA SUNDER REDDY AGE: 40 YEARS OCC: SECONDARY GRADE TEACHER, PS THATIPARTHY, BHOOTHPUR, R/o: H.NO.1-62, GANGARAM, BIJINAPALLY, MAHABUBNAGAR.
2. MADIREDDY SHYAM SUNDER REDDY S/o: SRINIVAS REDDY AGE: 45 YEARS Occ: SECONDARY GRADE TEACHER, PS VADDERAGUDISELU, MAHABUBNAGAR, R/o H.NO.1-62, GANGARAM, BIJINAPALLY, MAHABUBNAGAR.
3. SAIBA VIJAYALAXMI W/o: RAGHAVENDRA AGE: 34 YEARS OCC:SECONDARY GRADE TEACHER, UPS BUDDA SAMUDRAM (Vill), THIMMAJIPET, R/o: H.NO. 3-13-7/8/5/4, VEERABHADRA COLONY, YENUGONDA, MAHABUBNAGAR.
4. PARIKA BHAGYALAXMI W/o: VENUGOPAL AGE: 56 YEARS OCC: SECONDARY GRADE TEACHER, PS CHANDRASPALLY, KOILKONDA, R/0 H.NO.1-3-155, RAJENDRANAGAR, MAHABUBNAGAR.
5. DONGALA GOPAL S/o: LAXMAIAH AGE: 51 YEARS OCC:LIVESTOCK ASSISTANT, R/o: H.NO.1-28, KOMIREDDY PALLY, GANDEED, RANGAREDDY. ..OPPONENTS No: 1 to 5.
Where as the above Disputant have filed above Arbitration case against you and another by Disputant in Form No. XVII, Chapter XII and Section 64 of the Chit Funds Act, 1982 & Rule 45 of the A.P. Chit Fund Rules 2008. The said case stands posted on 22-10-2024 for your appearance. You are hereby directed to appear before the Deputy Registrar of chits Mahabubnagar on said date at 11:00 a.m. either in person or through Advocate, in default the matter will be decided on the material available on record.
// BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS //
Date:25-09-2024. Counsel for Disputant
Sd/- C.RAJEEV KUMAR, B.Com., LL.B. Advocate
H.No:5-1-41,Valabhanagar, Mahabubnagar, Cell: 9440512290

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10 గం. నుంచి మ.1 వరకు
మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143

తెరపై ఈనాడు


బాలాజీ - **దేవర**, తిరుమల - **దేవర**, వెంకటేశ్వర- **దేవర**, వెంకటాద్రి- **సత్యం సుందరం**
శ్రీకృష్ణ -**జోకర్ (ఉదయం ఆటలు) దక్షిణ (రాత్రి ఆటలు)**
–న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం











మహబూబ్‌నగర్: కుర్మనెట్టికాలనీ తోటమైసమ్మ ఆలయంలో.. దీవింద్రనగర్‌లోని శీతలాదేవి ఆలయంలో.. పద్మావతికాలనీ కాళికాదేవి ఆలయంలో.. శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో.. శాకంబరీదేవిగా.. ఏనుగొండలో దుర్గామాత అలంకరణ.. జడ్చర్ల: 24వ వార్డు సంతోషిమాత ఆలయంలో.. విద్యానగర్‌కాలనీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో.. ఉడిత్యాల్‌లో శ్రీమహాలక్ష్మి అలంకరణలో.. భూత్పూర్: అమిస్తాపూర్‌లో..

అమ్మవారి ఉత్సవం.. బతుకమ్మ వైభవం


జడ్చర్ల: సకల దేవతల ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు


మహబూబ్‌నగర్: కోలాటం వేస్తున్న చిన్నారులు



జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని వివిధ ఆలయాలు, మండపాల్లో అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. జడ్చర్ల పట్టణంతో పాటు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవరకద్ర పట్టణంలోని వాసవీమాత ఆలయంలో భక్తులు రూ.44,44,444 నగదుతో అలంకరించారు. లక్ష్మిపల్లెలోని శ్రీకనకదుర్గాదేవి విగ్రహానికి రూ.1,56,000 నగదు, చిన్నచింతకుంట మండలం కురుమూర్తిలో రూ.2,03,300 నగదుతో అలంకరించారు. అమిస్తాపూర్‌లోని శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో రూ.4 లక్షలతో అలంకరించారు. మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల మైదానంతోపాటు జిల్లావ్యాప్తంగా అమ్మవారి పూజలు, బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**




దేవరకద్ర: అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు


మహబూబ్‌నగర్: కోలాటం ఆడుతున్న మహిళలు


రాజేంద్రనగర్‌లో మహిళల కుంకుమార్చన..


మహబూబ్‌నగర్: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


దేవరకద్ర: గోపన్‌పల్లిలో బతుకమ్మలతో మహిళలు

బాస్కెట్‌బాల్ మహిళా జట్టుకు కాంస్యపతకం


బాస్కెట్‌బాల్ టోర్నీలో మూడోస్థానంలో నిలిచిన మహిళా జట్టుతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నిర్వహించిన బాస్కెట్‌బాల్ మహిళా టోర్నీలో మహబూబ్‌నగర్ జిల్లా మహిళా జట్టు కాంస్య పతకం సాధించి మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహిళా జట్టుకు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్, ప్రధాన కార్యదర్శి నసురుల్లా హైదర్, సభ్యులు ఖాలేద్‌అలీ, మహ్మద్ ఇలియాస్, కె.శుభాంజీ, ఫారుఖ్ ముఖరం, వై.శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సుదర్శన్‌రెడ్డి నియామకం



సుదర్శన్‌రెడ్డి, అవేజ్

పాలమూరు, న్యూస్‌టుడే: పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న అతనికి ప్రధాన న్యాయస్థానం పీపీగా అవకాశం కల్పించింది. సుదర్శన్‌రెడ్డి మూడేళ్లపాటు పదవీలో ఉండనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా కోర్టులో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు పూలమాలలతో అతన్ని ఘనంగా సత్కరించారు. జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న మహమ్మద్ అవేజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు.

నేడు బాదేపల్లి మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

జడ్చర్ల, న్యూస్‌టుడే: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం చేపడుతున్నట్లు నూతన అధ్యక్షురాలు తంగేళ్ల జ్యోతి తెలిపారు. ఉదయం 11 గంటలకు అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లను చేపట్టారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సైకియాట్రి విభాగం అధిపతి డా.అశోక్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే : మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్వీఎస్ సైకియాట్రి విభాగాధిపతి డా.అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ ఏనుగొండలోని ఎస్వీఎస్ వైద్యశాల వద్ద మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక వ్యాధులు గుర్తించడం, నియంత్రించటం, ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వైద్య విద్యార్థులు నాటిక రూపంలో మానసిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఎస్వీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి, సహాయ ఆచార్యులు డా.వెంకట రాహుల్, డా.భార్గవ స్వరాజ్ పాల్గొన్నారు.

కాలిపోతున్న నియంత్రికలతో రైతుల అవస్థలు

అడ్డాకుల, భూత్పూర్ : పొలాల వద్ద అమర్చుకున్న విద్యుత్తు నియంత్రికలు వెంటవెంటనే కాలిపోతుండటంతో అడ్డాకుల, మూసాపేట మండలాల రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నాణ్యమైన విద్యుత్తు సరఫరా లేకపోవటం వల్లనే నియంత్రికలు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాలాపూరు గ్రామానికి చెందిన రైతులు శేరి రాములు, కృష్ణయ్యల పొలాలు పెద్దవాగు అవతల ఉన్నాయి. వీరు ఏర్పాటు చేసుకున్న నియంత్రిక రెండు రోజుల క్రితం కాలిపోవడంతో అతికష్టం మీద పొక్లెయిన్ సహాయంతో వాగు దాటి వెళ్లి నియంత్రికను తెచ్చి జడ్చర్లలో మరమ్మతులు చేయించారు. అమర్చిన వెంటనే కాలిపోయింది. చేసేది లేక రైతులు మళ్లీ నియంత్రికను జడ్చర్లకు తీసుకువెళ్లి మరమ్మతులు చేయించి ఆదివారం బిగించారు. మోటార్లు ఆన్ చేయగానే మళ్లీ కాలిపోయింది. అడ్డాకుల మండలంలోని శాఖాపూరు, కందూరు శివారులోని చాలా నియంత్రికలు ఇలానే కాలిపోయాయని రైతులు కుమ్మరి సాయి, వెంకటయ్య, నాగన్నలు వాపోయారు. అసలే పొట్ట దశలో ఉన్న వరిపైరుకు నీరు ఎక్కువగా అవసరం. ఈ సమయంలో విద్యుత్తు, నియంత్రికల సమస్య వేధిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యమైన విద్యుత్తును అందిస్తేనే నియంత్రికలు లోడును తట్టుకుని నిలబడతాయని రైతులు తెలిపారు.

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడండి


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుల్లారెడ్డి

గండీడ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో భగీరథ నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రామ మంచినీటి సహాయకులకు 4 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేతి పంపులు, స్టార్టర్లు, లీకేజీలకు సంబంధించిన పనులపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీడీవో దేవన్న, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రంజిత్‌రెడ్డి, ఏఈఈ రామక్రిష్ణ, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో నీటి నిర్వహణలో మంచినీటి సహాయకులు కీలకపాత్ర పోషించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అర్చన సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాలుగు రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ గ్రామాల్లో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం శిక్షకులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో జయరామ్‌నాయక్, ఎంపీవో బద్రూనాయక్, ఏఈ సమీఉల్లాఖాన్, నీటి సహాయకులు పాల్గొన్నారు.

బాలానగర్: గ్రామాల్లోని మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని మిషన్ భగీరథ డీఈఈ అర్చన అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల తాగునీటి సరఫరా సహాయకులకు నిర్వహించిన ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం తాగునీటి సరఫరా సహాయకులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఏఈఈ అభినవ్, అధికారులు శివకుమార్, శ్రీనివాస్, మురళి, సిబ్బంది తదితరులున్నారు.

భాజపా శ్రేణుల విజయోత్సవం


భాజపా కార్యాలయం ఎదుట సంబరాలు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రంలో భాజపా మూడోసారి గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు దిశగా హ్యాట్రిక్ సాధించినందుకు భాజపా జిల్లా నాయకులు మంగళవారం రాత్రి పార్టీ కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి కె.రాములు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, జయశ్రీ, పాండురంగారెడ్డి, రమేష్‌కుమార్, కిరణ్ కుమార్‌రెడ్డి, నారాయణయాదవ్, బాలీశ్వరీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో చోటు



పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర బాధ్యులుగా ఎంపికై ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా నాయకులు

పాలమూరు, మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన పలువురికి చోటు దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పలు మండలాలకు సంఘం ప్రతినిధులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్థానం దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గోపాల్‌నాయక్, తిమ్మారెడ్డి, ఎల్లయ్య, సురేశ్‌రెడ్డి, బుచ్చారెడ్డి, గోవిందమ్మ, గాయత్రి, జైపాల్‌రెడ్డి, అశ్వినీ చంద్రశేఖర్, పురుషోత్తంగౌడ్, ఎన్ వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తో పాటు 31 మంది అసోసియేట్ అధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శులుగా 27 మంది, ఉపాధ్యక్షులుగా 29 మందికి స్థానం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులుగా మదన్‌మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల రుణాల వ్యవహారంలో సీవోకు తాఖీదు

లావాదేవీల వివరాలు ఇవ్వాలని ఎస్‌బీఐ ఆర్‌ఎంకు లేఖ

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణం కోయనగర్‌లోని సాయి మహిళా సంఘాల సమాఖ్యలో పొదుపు సొమ్ము దుర్వినియోగంపై పురపాలక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి సంబంధిత సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్) జి.యాదయ్యకు తాఖీదు జారీ చేశారు. ఆ ప్రతిని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు కూడా పంపించారు. ఆర్థిక లావాదేవీలు చూసే ఆర్పీ శ్రీలత మహిళా సంఘాల సభ్యుల పేర్ల మీద స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో పెద్ద మొత్తంలో అవకతవకలకు పాల్పడినా సంబంధిత సీవోగా ఎందుకు పర్యవేక్షణ చేయలేకపోయారని కమిషనర్ ప్రశ్నించారు. సంఘాల్లోని సభ్యులకు తెలియకుండా ఆర్పీ స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకోవడం ద్వారా ఆర్థిక నేరానికి పాల్పడ్డారని, దీన్ని గుర్తించనందుకు సీవోగా మిమ్మల్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కమిషనర్ తాఖీదుకు సీవో జి.యాదయ్య కూడా వివరణ ఇచ్చారు. కోయనగర్ సాయి మహిళా సంఘాల సమాఖ్య లెక్కాపద్దులు చూసే ఆర్పీ శ్రీలత సీవోగా ఉన్న తన ప్రమేయం లేకుండానే పలుమార్లు బ్యాంకులో క్షేత్రస్థాయి అధికారిని సంప్రదించి సంఘ సభ్యుల ఆర్థిక లావాదేవీలు వారికి తెలియకుండానే కొనసాగించి అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇందులో తన ప్రమేయం లేదని, ఇటీవల ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో తాను కల్పించుకుని కొన్ని సంఘాల సభ్యులకు సంబంధించిన రూ.6 లక్షల వరకు డబ్బులు రికవరీ చేయించానని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే కోయనగర్ సాయి మహిళా సంఘాల సమాఖ్యలో ఆర్పీ శ్రీలత జరిపిన ఆర్థిక లావాదేవీల చిట్టాను పూర్తి వివరాలతో అందజేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్‌కు నోటీసు కూడా అందజేశారు. ఈ నివేదిక వస్తే కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో ఎంత మొత్తంలో మహిళల పొదుపు సొమ్ము దుర్వినియోగం జరిగిందో పక్కాగా తెలిసే అవకాశముంది.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

హన్వాడ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకులు కురుమూర్తి ఆధ్వర్యంలో పలువురు కార్మికులు స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయండం వల్ల మండలంలోని భవన కార్మికులు ఇబ్బందుల నుంచి బయట పడతారని అన్నారు.

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గాధిర్యాల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలన్న, గ్రామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, రాములు సభ్యులు బుగ్గయ్య, రాములు, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఎదుట కార్మికుల ఆందోళన



ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేయని దొంగతనం తమపై మోపేలా నర్సు అనుచితంగా మాట్లాడారని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు, పేషంట్ కేర్, సెక్యూరిటీ, పర్యవేక్షకులు తదితరులు నిరసన వ్యక్తం చేశారు. మాతాశిశు విభాగంలోని ప్రసూతి గదిలో ఓ నర్సుకు సంబంధించిన నకిలీ బంగారం గొలుసు మాయమైందని ఆమె ఆగ్రహం వ్యక్తంచేసింది. సీసీ టీవీ ఫుటేజ్‌లో చూడగా, అందులో శిక్షణ పొందుతున్న విద్యార్థిని దాన్ని తీసి మరో గదిలో భద్రపరిచినట్లు కనిపించింది. కానీ ఈ విషయం తెలియక నర్సు పారిశుద్ధ్య సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారంతా ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎవరినీ పర్యవేక్షకుల గదిలోకి పంపకుండా గేట్ వద్ద నిలువరించారు. సమాచారం అందుకున్న సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ కార్మికులతో మాట్లాడి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనకు చెప్పాలని సూచించారు. మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని, నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు చేయరాదని కోరారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తేయాలి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సకల జనుల సమ్మె కాలంలో ఆర్టీసీ బస్సులు అడ్డుకున్నారంటూ 27 మంది ఉద్యోగులపై కేసులు నమోదు చేశారని, ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులు ప్రభుత్వం ఎత్తివేయాలని తెలంగాణ పింఛన్ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సాయిలుగౌడ్, జిల్లా కార్యదర్శి కె.బాలకిషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసులు నమోదు చేసిన వారిలో చాలా వరకు ఉద్యోగ విరమణ చేశారని, ఈ వృద్ధాప్య సమయంలో న్యాయస్థానాల చుట్టూ తిరగడం బాధాకరమన్నారు. కేసులు నమోదు చేయబడిన వారు తమ వ్యక్తిగత సమస్యలపై కాకుండా తెలంగాణ సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్నారని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకునేలా చూడాలన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానము, మహబూబ్‌నగర్
కేసు O.S.No.216/2023
S.B.I మెట్టుగడ్డ మహబూబ్‌నగర్ శాఖ.. – వాది
మరియు
అంబూరు వెంకటేశ్వర్లు ... ప్రతివాది
To,
అంబూరు వెంకటేశ్వర్లు తండ్రి A.కిషన్‌రావు, వయస్సు: 55 సంవత్సరములు, వృత్తి: ప్రభుత్వ ఉద్యోగి, నివాసము ఇం.నెం: 3-8-112, పాతదవఖానా దగ్గర, రవీంద్రనగర్, మహబూబ్‌నగర్ పట్టణము.
ఇందుమూలముగా నీకు తెలియజేయటము ఏమనగా! S.B.I మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ శాఖ వారు, మీరు బ్యాంకుకు చెల్లించవలసిన రుణము 2,70,642/- రూ॥లు రాబట్టుకొనుటకు మీపైన సదరు న్యాయస్థానములో దావా దాఖలు చేసినారు. ఇట్టి దావాలో మీకు పలు పర్యాయములు కోర్టు ద్వారా సమన్లు పంపినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనకుండా తిప్పి పంపుచున్నారు. చివరగా పైన పేర్కొన్న దావా తేది: 17-10-2024న ఉదయం.10:30 గంటలకు మీ హాజరు నిమిత్తము వాయిదా వేయబడినది. కావున మీరు కానీ, మీ తరుపున న్యాయవాది కాని హాజరుకానిపక్షములో దావా ఏకపక్షముగా తీర్మానించబడును.
"న్యాయస్థానము ఆదేశానుసారము"
S/- శ్రీ అయలూరి పార్థసారథి న్యాయవాది & నోటరి
మహబూబ్‌నగర్. (M).9441564972



దివిటిపల్లి రైల్వే స్టేషన్ ముందు ఎదిర వైపు రహదారిలో ఏపుగా పెరిగిన చెట్ల మధ్య ప్రమాదకరంగా మలుపు.. సల్లకుంట అలుగు వద్ద..

మూల మలుపులు.. మృత్యులోగిళ్లు

దివిటిపల్లి, ఎదిర గ్రామాల మధ్య మూల మలుపులతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న మూడు కిలోమీటర్ల దూరంలో ఐదు చోట్ల అత్యంత ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారికి ఇరువైపులా ఏపుగా ముళ్లపొదలు, హరితహారం చెట్లు పెరిగాయి. మూల మలుపుల్లో అవతలి నుంచి ఏ వాహనం ఎంత వేగంగా వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏటా వర్షాకాలంలో మలుపుల వద్ద ఇదే పరిస్థితి ఉంటుందని, రాత్రి వేళ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మలుపుల్లో వేగ నిరోధానికి స్పీడ్ బ్రేకర్లు నిర్మించి హెచ్చరిక బోర్డులు ఉంచాలని అధికారులను కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ఎన్నికల్లో గెలుపు దిశగా అడుగులు : భాజపా

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: కార్యకర్తలు గెలుపు దిశగా అడుగులు వేయాలని భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోయిలసాగర్ గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా పని చేసి అత్యధిక స్థానాలు సాధించాలన్నారు. మండలాధ్యక్షుడు కృష్ణంరాజు, నారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయండి

పాలమూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యను ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు అన్ని విధాలుగా పటిష్ఠం చేసి సమాజానికి నాణ్యమైన ఉచిత విద్య అందించాలని మహబూబ్‌నగర్ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ప్రభుత్వం విద్యా సంస్థలను పట్టించుకోకుండా వాటిని బలహీన పరుస్తూ, కొత్తకొత్త పేర్లతో విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తూ, ఉన్న వాటిని ఉదాసీనంగా చూడటం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం విద్యావంతులను, మేధావులను, ప్రజా సంఘాలను, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ప్రభుత్వ విద్యారంగానికి అభివృద్ధికి అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. మహబూబ్‌నగర్ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు మహమూద్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు కిష్టప్ప, రాఘవాచారి, వామన్‌కుమార్, శ్రీశైలం, నవీన్, తిమ్మప్ప, కేసీ వెంకటేశ్వర్లు, విజయలక్ష్మీ, ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సరస్వతి దేవి పూజ శుభాకాంక్షలు
జిల్లా ప్రజలకు, శ్రేయోభిలాషులకు సరస్వతి దేవి పూజ శుభాకాంక్షలు..
చేనేత హస్తకళా ప్రదర్శన మరియు అమ్మకం
వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక ఆఫర్లు కలర్‌ఫుల్ ఎగ్జిబిషన్
నమ్మకమైన మా సంస్థ నుండి నమ్మకమైన ధరలు, నాణ్యమైన వస్త్రాలు
భారతదేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్స్ మరియు కాటన్ వస్త్రాలు
HANDLOOM INDIA
బతుకమ్మ దసరా సూపర్ సేల్
ఆంధ్రప్రదేశ్: ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి మరియు ఉప్పాడ, అస్సాం: మూగా & ఎరిసిల్క్స్, బీహార్: బగల్పుర సిల్క్స్ & టస్సర్, ఛత్తీస్‌ఘడ్: ట్రిబల్ వర్క్స్ కోసా శిల్క్స్, గుజరాత్: బాందిని, కచ్చ ఎంబ్రైడరీ డ్రెస్ & శారీస్, జమ్మూ & కాశ్మీర్: ఎంబ్రైడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్ & పాష్మిన్ శాల్, కర్నాటక: క్రేప్ & ప్రింటెడ్ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, మధ్యప్రదేశ్: చందేరి, మహేశ్వరి, రాజస్థాన్: కోటా, బాందేజ్, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, తెలంగాణ: గద్వాల్, నారాయణపేట & పోచంపల్లి, ఉత్తరప్రదేశ్: జమ్దాని & బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్, ✦ హరియాణ బెడ్‌కవర్లు & కుషన్ కవర్లు ✦ లక్నోవి, కుర్తీస్ & డ్రెస్ మెటీరియల్స్
TIME: 10.30 AM TO 9:30 PM | All Debit & Credit Cards Accepted
25th SEP to 15th OCT-24 | T.T.D. కళ్యాణ మండపం | గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా, రైల్వే స్టేషన్‌రోడ్, మహబూబ్‌నగర్

(c) eenadu